



# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 11-04-2024 సంపుటి : 06 సంచిక : 211 పేజీలు : 8 వెల : రూ 3-00

## బాబుది బోగస్ రిపోర్ట్.. జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్: సీఎం జగన్




పల్నాడు జిల్లా: జిత్తులమారి పార్టీలు మోసాలు, కుట్రలు చేస్తున్నాయంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. జిత్తుల మారి చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా 12వ రోజు బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల అయ్యప్పనగర్ బైపాస్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మనం సిద్ధం సిద్ధం.. అంటే.. వారికి యుద్ధంగా ప్రతిధ్వనిస్తోందన్నారు."ఈ ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు. ప్రజలకు, చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు. జగన్‌కు ఓటేస్తే.. ఇప్పుడున్న పథకాలు కొనసాగుతాయి. చంద్రబాబు అంటే ఎన్నికల ముందు గంగా.. అధికారం దక్కిన తర్వాత చంద్రముఖి. చంద్రబాబుకు ఓటేస్తే పేదవాళ్లు మోసపోతారు. ఇవి పేదల తలరాతను మార్చే ఎన్నికలు. మేం ఎప్పుడూ పేదల పక్షమే. జరుగుతున్న మంచి కొనసాగాలంటే జగన్‌కు ఓటేయాలి. బాబుకు ఓటేస్తే ఇప్పుడున్న పథకాలన్నీ ఆగిపోతాయి.. పచ్చమీడియా గాడిదను తీసుకొచ్చి గుర్రం అని ప్రచారం చేస్తాయి" అని సీఎం జగన్ మండిపడ్డారు."చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారా?. చంద్రబాబు హయాంలో ఒకరికైనా మంచి జరిగిందా?. జాబు రావాలంటే ఎవరు కావాలి?. జాబు రావాలంటే ఫ్యాను రావాలా.. లేక తుప్పు పట్టిన సైకిల్ రావాలా?. అధికారంలోకి రాగానే 2 లక్షల 31 ఉద్యోగాలు భర్తీ చేశాం. పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. గతంలో రైతుకు ఏమీ చేయని చంద్రబాబు.. ఇప్పుడు మేలు చేస్తాడట. చంద్రబాబుది బోగస్ రిపోర్ట్.. జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబే. 'కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్న వ్యక్తి చంద్రబాబు" అంటూ సీఎం జగన్ ధ్వజమెత్తారు."రైతు రుణమాఫీ చేస్తానన్నాడు.. చేశాడా?. పగటిపూట 12 గంటల ఉచిత విద్యుత్ ఇస్తానన్నాడు.. ఇచ్చాడా?. బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తానన్నాడు.. విడిపించాడా?రైతులకు సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టేశాడు.. మనం వచ్చాక రైతన్నకు తోడుగా ఉన్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతున్నకు తోడుగా ఉన్నాం. రైతన్నకు చంద్రబాబు చేసిందేమీ లేదు" అని సీఎం జగన్ పేర్కొన్నారు."ప్రతి ఏడాది రైతు భరోసా ద్వారా రూ. 13,500 ఇచ్చాం. పగటిపూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పాం రూ.64 వేల కోట్లతో ధాన్యం సేకరణ చేపట్టాం. ఏ సీజన్‌లోని ఇన్‌పుట్ సబ్సిడీని ఆ సీజన్‌లోనే ఇస్తున్నాం. సున్నా వడ్డీకే రుణాలిచ్చాం. 35 లక్షల ఎకరాలకు శాశ్వత భూ హక్కులు కల్పించాం" అని సీఎం జగన్ వివరించారు."వాలంటీర్ల వ్యవస్థను చూస్తుంటే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పెరిగెడుతున్నాయి. వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చంద్రబాబు అంటున్నాడు.

## కచ్చాతీవు మత్స్యకారుల అరెస్ట్‌పై మోదీ సంచలన ప్రకటన..



చెన్నై: లోక్‌సభ ఎన్నికల వేళ తమిళనాడులో ప్రజలకు ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. శ్రీలంకలో అరెస్ట్ అయిన మత్స్యకారులను క్షేమంగా భారత్‌కు తీసుకువస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాగా, ప్రధాని మోదీ తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలూరులో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. ఈరోజు దేశం మొత్తం కాంగ్రెస్, డీఎంకే పార్టీల మరో కపట నాటకం గురించి చర్చిస్తోంది. కాంగ్రెస్ హయాంలోనే కచ్చాతీవు ద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించారు. ఎవరి ప్రయోజనం కోసం కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఏ కేబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. కచ్చాతీవు ద్వీపం వద్దకు వెళ్లిన వేలాది మంది తమిళనాడు మృత్స్యకారులను శ్రీలంక కోస్టల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరి అరెస్ట్‌పై కాంగ్రెస్ ఎందుకు మౌనం వహించింది. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అరెస్ట్ అయిన మత్స్యకారులను క్షేమంగా వెనక్కి తీసుకువస్తుంది. అదొక్కటే కాదు మరణ శిక్షలు విధింపబడిన వారిని కూడా సజీవంగా వెనక్కి తీసుకువస్తున్నాం. వారిని వారి వారి కుటుంబాలకు అప్పగించే బాధ్యత బీజేపీది అని వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమిళ సంస్కృతికి డీఎంకే వ్యతిరేకి. డీఎంకేది విభజన రాజకీయం. తమిళులను చీకట్లో ఉంచేసింది. అవినీతి చేయడానికి డీఎంకే కాపీరైట్ తీసుకుంది. కుటుంబం మొత్తం తమిళనాడును దోచుకుంటోంది. తమిళనాడులో బీజేపీ చరిత్ర సృష్టించబోతోంది. రానున్న ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీ గెలవబోతోంది అంటూ కామెంట్స్ చేశారు.




హైదరాబాద్ (ఏప్రిల్ 10)ఈ నెల 21న భువనగిరి లో కాంగ్రెస్ సభపార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 21న భువనగిరిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ నిర్వహిం చనుంది. ఆ రోజున కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనుండగా.. అదేరోజు జరిగే సభలో సీఎం రేవంత్ పాల్గొన నున్నారు. అటు మే మొదటి వారం లో నిర్వహించే బహిరంగ సభకు ప్రియాంకా గాంధీని ఆహ్వానించాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు.

## జగన్‌ను భూస్తాపితం చేస్తేనే రాష్ట్రం సుభిక్షం

రాష్ట్రంలో అగ్నికి వాయువు తోడైంది
నాకు అనుభవం ఉంది..పవన్‌కు పవర్ ఉంది
మా జెండాలు వేరైనా జఅఎండా ఒక్కటే
చీకటి పాలన అంతం కోం ఓట్లు చీకుండా పొత్తు
తణుకు ఉమ్మడి ప్రచారంలో టిడిపి అధినేత చంద్రబాబు





తణుకు,ఏప్రిల్10 సీఎం జగన్ పాలనలో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని, జగన్‌ని భూస్థాపితం చేసి.. రాష్ట్రంలో చీకట్లను పారదోలుతామని స్పష్టం చేశారు. తణుకులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి బాబు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..'నాకు అనుభవం ఉంది.. పవన్ కళ్యాణ్ కు పవర్ ఉంది. రాష్ట్రంలో అగ్నికి వాయువు తోడైంది.రాష్ట్రానికి ఇక అన్నీ మంచి రోజులే. రాష్టాన్ని కాపాడుకోవడానికి మూడు పార్టీలు కలిశాయి. జెండాలు వేరైనా.. అజెండా ఒక్కటే. జగన్ ను భూస్థాపితం చేయడమే ప్రధాన లక్ష్యం. చీకటి పాలనను అంతం చేయడానికి ఓట్లు చీలకూడదని చెప్పిన మొదటి వ్యక్తి పవన్ కళ్యాణ్. యువత కన్నెర్ర చేస్తే జగన్ లండన్ కు పారిపోతాడు. జగన్ చేతిలో చిప్ప పట్టుకుని ఎక్కడికి పోతాడో అప్పుడే చెప్పను.. పవన్ కళ్యాణ్, నేను చేసి చూపిస్తాం. 2014 నుంచి 2019వరకు ఏం జరిగిందో అర్థం చేసుకోండి. ఇప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకోండి. ఎన్నికల్లో గెలవడానికి **(మిగతా 2లో )**

## గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు విడుదల.. జులై 28న మెయిన్స్




,విజయవాడ: గ్రూప్- 2 పరీక్ష ప్రిలిమ్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ బుధవారం(ఏప్రిల్10) ప్రకటించింది. ఫలితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.జులై 28న గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జరగనుందని తెలిపింది.1:100 నిష్పత్తిలో గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. గత ఏడాది డిసెంబర్ 7న గ్రూప్ -2 నోటిఫికేషన్ జారీ అయింది. ఫిబ్రవరి 25న గ్రూప్ 2 ప్రిలిమ్స్ పరీక్ష జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ఏడు వారాల్లో గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలీను ఏపీపీఎస్సీ ప్రకటించింది.రాష్ట్ర వ్యాప్తంగా 899 పోస్టులకి గ్రూప్-2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. మొత్తం 4,04,037 మంది అభ్యర్థులు గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలు రాయగా 92 వేల మంది క్వాలిఫై అయ్యారు. త్వరలోనే గ్రూప్ వన్ ప్రిలిమ్స్ ఫలితాలను కూడా ఏపీపీఎస్సీ ప్రకటించనుంది

## వైసిపి పాలనలో అవినీతి రాజ్యం

కారుమూరి అడ్డూ అదుపులేని దోపిడీ
దోచుకున్న సొమ్ముతో హైదరాబాద్‌లో పరిశ్రమలు
తణుకు ప్రచారంలో జనసేనాని పవన్ కళ్యాణ్ విమర్శలు



# సంపాదకీయం

గురువారం 11-04-2024

## పార్లమెంట్ లో సాగని ఫలప్రదమైన చర్చ

స్వాతంత్ర భారతంలో ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా భారత పార్లమెంటు నిలుస్తుందని నాడు మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. 1952 నుంచి నేటి వరకు మన దేశం 17 లోక్‌సభల పనితీరును చూడగా, 2024 జూన్ 4 నాటికి 18వ లోక్‌సభ ఏర్పడబోతోంది. ఈ నేపథ్యంలో గడచిన 17వ లోక్‌సభా కాలంలో ఎలా గడిచిందో ఓసారి తెలుసుకునే ప్రయత్నిం చేద్దాం. 17వ లోక్‌సభ చిట్టచివరి సమావేశం జరిగిన రోజు దేశ ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సభా కాలంలో 97% సమయం సద్వినియోగం అయిందనీ, ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన 7 సెషన్లు 100% కంటే ఎక్కువ ఉపయుక్తంగా నడిచాయని చెప్పుకొచ్చారు. ఆయన మాటలను వింటున్నప్పుడు గత 77 ఏడేళ్లలో తమ హయాంలోనే చట్టసభలు సక్రమంగా పనిచేస్తున్నాయనే రవ్వంత అతిశయమూ కనిపించింది. అయితే, తన పాలనా కాలంలో విస్మరించిన కొన్ని ప్రజాస్వామ్య సంప్రదాయలపై ప్రధాని మౌనం వహించారు. 1969 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి ఇచ్చే సంప్రదాయానికి పాతరేస్తూ, అసలు ఎన్నికే జరపకుండా మౌనం వహించారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి ఈ ప్రభుత్వ హయాంలోనే ఇలా జరిగింది.గడచిన ఐదేళ్ల కాలంలో మన లోక్‌సభ ఎంత గొప్పగా పనిచేసిందో తెలుసుకునేందుకు కొన్ని గణాంకాలను పరిశీలిద్దాం. వాజపేయి ప్రధానిగా ఉన్న 1999 ? 2004 మధ్యకాలపు 13వ లోక్‌సభ 423 రోజులు పనిచేసింది. కానీ, 17వ లోక్‌సభ కేవలం 278 రోజుల్లోనే సమావేశమైంది. అంటే 13వ లోక్‌సభ కంటే 17వ లోక్‌సభ సుమారు 34% సమయం తక్కువ పనిచేసింది. 2020 ? 2022 మధ్యకాలంలో లోక్‌సభ సమావేశాలు ఏడు పర్యాయాలు అనుకున్న షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. అంతేగాక.. 2023లో జరిగిన చివరి ప్రత్యేక సెషన్‌తో పాటు శీతాకాల సమావేశాలు కూడా షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. ఇలా షెడ్యూల్ కంటే ముందే సెషన్ ముగిస్తే.. ఆ కోత పెట్టిన రోజుల్లో ఎంపీలు అడగాల్సిన ప్రశ్నలు మిగిలిపోతాయని ప్రభుత్వానికి అనిపించలేదు. ఇక ఆర్డినెన్స్‌ల జారీలోనూ 17వ లోక్‌సభా కాలపు ప్రభుత్వం రికార్డులకెక్కింది. పదేళ్ల యుపిఎ హయాంలో నాటి కేంద్ర ప్రభుత్వం 61 ఆర్డినెన్స్‌లు జారీ చేయగా, 2014 నుండి 2021 మధ్యనే ఏకంగా 76 ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి. 2019 నుంచి డిసెంబర్ 21, 2023 నాటికి లోక్‌సభలో 86, రాజ్యసభలో 103 బిల్లులను 2 గంటల కంటే తక్కువ టైంలో చర్చించి పాస్ చేశారు. 2023 వర్షాకాల సమావేశంలో రాజ్యసభ ఫార్మసీ (సవరణ) బిల్లును కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదించి కొత్త రికార్డును సృష్టించింది. ఆ మర్నాడే సెంట్రల్ జిఎస్‌టి సవరణ, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి సవరణ బిల్లులను మన లోక్‌సభ సరిగ్గా మూడే నిమిషాల్లో ఆమోదించింది. అంతేకాదు.. అసలు ఎజెండాలోని బిల్లులను పక్కనబెట్టి, హటాత్తుగా కొత్తబిల్లులు తీసుకొచ్చి వాటిని నిమిషాల వ్యవధిలో ఆమోదించిన ఘనతా 17వ లోక్‌సభకే దక్కుతుంది. 2009 ? 2014 మధ్యకాలంలో నాటి ప్రభుత్వం 71% బిల్లులను స్టాండింగ్ కమిటీలకు పంపగా, 2019 నుండి కేవలం 16% బిల్లులు మాత్రమే స్టాండింగ్ కమిటీ ముందుకు పరిశీలన కోసం వెళ్లాయి. 2014 ? 2021 మధ్యకాలంలో మన పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లులలో 74 బిల్లులు (24.5%) బిల్లులు మాత్రమే సంప్రదింపుల కోసం సర్క్యులేట్ చేశారు. అయితే, ఈ 74 బిల్లులలో కనీసం 40 బిల్లులను విపక్షం పరిశీలించేందుకు ఇవ్వాల్సిన నెలరోజుల వ్యవధిని ఈ ప్రభుత్వం కుదించివేసింది. సమాజాన్ని బాగా ప్రభావితం చేసే, దేశ, సమాజపు తక్షణ ప్రాధాన్యమున్న అంశాలపై చర్చించాలని రూల్ నంబరు 267 కింద విపక్ష సభ్యులు అనేకసార్లు లేవనెత్తినా వారికి మాట్లాడే అవకాశం రాలేదు. లోక్‌సభలో సభానాయకుడిగా ఉన్న ప్రధాని మోదీ 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం' మీద తప్ప ఈ ఐదేళ్ల కాలంలో కీలకమైన ఏ అంశంమీదనైనా సభలో నిలబడి సభ్యుల అనుమానాలు దూరంచేయలేకపోయారు. మరీ ముఖ్యంగా కీలకమైన 3 క్రిమినల్ బిల్లుల విషయంలో హోం వ్యవహారాల కమిటీ ప్రజల నుండి ఎలాంటి సలహాలను గానీ సూచనలను గానీ ఆహ్వానించలేదు. ఈ క్రిమినల్ బిల్లుల విషయంలో సర్కారు ఆత్రుత, నాటకీయత ఎంతగా కనిపించిందంటే.. ఈ బిల్లుల మీద అభిప్రాయాలు చెప్పే అవకాశం ప్రభుత్వం నిర్ణయించిన వ్యక్తులకు మాత్రమే దక్కింది. నిలదీసిన విపక్షానికి సర్కారు మౌనమే సమాధానమైంది. ఇక 2014 నుంచి చివరి సెషన్ వరకు కేవలం ఐదంటే ఐదు బిల్లులే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీల ముందుకు వెళ్లాయి. 2016– 2023 మధ్యకాలంలో వచ్చిన బడ్జెట్ సమావేశాల్లో 79% సెషన్స్‌లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదాలు జరిగిపోయాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఆయా శాఖలు తమ శాఖ కేటాయింపులను లోతుగా పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 40 రోజుల సమయం ఇచ్చేవారు. 2016 నుంచి అది సగానికి కుదించబడింది. ఈ గణాంకాలను బట్టి ఈ ప్రభుత్వానికి చర్చల మీద, సంప్రదింపుల మీద ఎంత నమ్మకం ఉన్నాయో అర్థమవుతుంది. చివరకు 2023 డిసెంబరు 13న ఇద్దరు ఆగంతకులు జీరో అవర్ జరుగుతుండగా, గ్యాలరీల్లోంచి దూకటంతో అప్పటిదాకా గొప్పగా కీర్తించబడిన ఈ గొప్ప భవనపు భద్రతా ప్రమాణాలు ఏపాటివో బయటపడ్డాయి. దీనిపై ప్రధాని, హోంమంత్రి ఓ ప్రకటన చేయాలని అడిగిన పాపానికి 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి పారేశారు. సరిగ్గా వారి సస్పెన్షన్ తర్వాత ప్రభుత్వం హడావుడిగా 3 క్రిమినల్ బిల్లులు, టెలీ కమ్యూనికేషన్ బిల్లులు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకపు బిల్లులను తీసుకొచ్చి వేగంగా వాటిని ఆమోదింపజేసుకుంది. వైవిధ్య భరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, లెక్కకు మించిన భాషలు, ప్రపంచపు అతి పెద్ద జనాభాకు ఆలవాలమైన ఈ దేశాన్ని పాలించే పాలకులు ఈ దేశపు బహుళత్వపు విలువలను గౌరవించి, విపక్షపు భిన్నాభిప్రా యాన్ని వినేందుకు సిద్ధంగా లేని రోజు.. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యమనే మాట కేవలం కాగితాలమీద ఉంటుందేమో గానీ, ఆచరణలో మాత్రం అది భిన్నాభిప్రాయాన్ని పట్టించుకోని అధ్యక్ష ప్రజాస్వామ్యమే అవుతుంది.

# జగన్‌ను భూస్థాపితం చేస్తేనే రాష్ట్రం సుభిక్షం

మొదటి పేజీ తరువాయి...

జగన్ ముద్దులు పెట్టారు. హగ్గులిచ్చారు. ఇప్పుడు పిడి గుద్దులు కురిపిస్తున్నారు. ఏపీలోని ప్రతి పౌరుడిని అడుగుతున్నా. అభివృద్ధి కావాలా? సంక్షోభం కావాలా.. నిర్ణయించుకోండి.దగా పథకాలు కావాలా, దోపిడి లేని పథకాలు కావాలో మహిళలు ఆలోచించాలి. ఇక్కడ ఉన్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులకు కనీసం గోనెసంచులు ఇవ్వలేని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ÷లుపై మొదటి సంతకం పెడతాం. పేదల ఆస్తులు దొంగిలించిన ఏకైక నాయకుడు జగన్. జగన్ అయిదేళ్ల పాలనలో అప్పులు పెరిగాయి. ఏ ఒక్కరూ బాగుపడలేదన్నారు. ఒక్క జగన్ మాత్రం బాగుపడ్డారు. అధికారం అంటే దోచుకోవడమేనని జగన్ అనుకున్నారు. ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టే నేను, పవన్ కళ్యాణ్ స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాం. అయిదేళ్ల పాలనలో మమ్మల్ని ఎన్ని ఇబ్బందులు పెట్టారో అందరికీ తెలుసు. వచ్చేనెల 13వ తేదీన మీరు ఇచ్చే తీర్పుతో తాడేపల్లిలో ఉన్న జగన్ కోట బద్దలవ్వాలి. ఎన్నికల ముందు ఆయన ఎవరినైనా కలిశాడా. పరదాల చాటునే వెళ్లారు. జగన్ వస్తున్నాడంటే పారిశ్రామిక వేత్తలు పారిపోతారు. నేను వస్తున్నానంటే, పారిశ్రామిక వేత్తలు తరలివస్తారు' అని బాబు అన్నారు. వాలంటీర్లను ఉద్దేశించి తణుకు సభలో బాబు మాట్లాడారు. 'వాలంటీర్లు కంగారు పడవద్దు.. వాలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుంది. రాజీనామాలు చేయవద్దు. మీకు అండగా ఉంటాం.అవసరమయితే పది వేలు కాదు, లక్ష రూపాయలు సంపాదించే మార్గం చూపిస్తా. కారుమూరి రూ.840 కోట్ల టీడీఆర్ బాండ్ల పేరుతో దోచుకున్నారు. తణుకులో జనసేన కార్యకర్తలపై దాడి చేశారు. అదే పవన్ కళ్యాణ్ కన్నెర్ర చేస్తే, ఆయన ఎక్కడ ఉంటారో తెలీదు. ధాన్యం తడిసిపోయిందని రైతులు అంటే వారిని బూతులు తిడతారు. అలాంటి మంత్రికి రైతులు బుద్ధి చెప్పాలి. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

# వైసిపి పాలనలో అవినీతి రాజ్యం




**కారుమూరి అడ్డూ అదుపులేని దోపిడీ**
**దోచుకున్న సొమ్ముతో హైదరాబాద్‌లో పరిశ్రమలు**
**తణుకు ప్రచారంలో జనసేనాని పవన్ కళ్యాణ్ విమర్శలు**



తణుకు,ఏప్రిల్10: వైసీపీ పాలనలో తణుకు అవినీతి నేలగా మారిపోయిందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఘాటు విమర్శలు చేశారు. స్థానిక మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందని విమర్శించారు. అవినీతి సొమ్మును మంత్రి హైదరాబాద్ తరలించాడని,బాలానగర్‌లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారని పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పంటకు మొలకలు వస్తున్నాయని రైతులు చెబితే మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చిన్నచూపు చూశారని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. దేశానికి అన్నం పెట్టే రైతును మంత్రి ఏడిపించారని గుర్తుచేశారు. ఆ మంత్రి కుమారుడు ఎన్నికల బరిలో ఉన్నారని, అతనికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసీపీ మంత్రుల తీరు సరిగా లేదని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు గురించి అడిగితే ఇరిగేషన్ మంత్రి డ్యాన్సులు చేస్తాడని.. బూతులు తిట్టే మరో మంత్రి ఉన్నాడని మండిపడ్డారు. మంత్రులు బాధ్యత మరిచారని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జగన్ పాలనకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో కొన్ని త్యాగాలు చేశామని పవన్ కళ్యాణ్ వివరించారు. టికెట్ల కేటాయింపులో త్యాగాలు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అనకాపల్లి నుంచి అన్నయ్య నాగబాబు పోటీ చేయాల్సి ఉందన్నారు. పొత్తు వల్ల టికెట్ త్యాగం చేయాల్సి వచ్చిందని వివరించారు. సీఎం జగన్ క్లాస్ వార్ అంటున్నారు.. క్లాస్ వార్ అంటే.. డబ్బున్న వారు పేదవారిని దోచుకోవడమా..? అని పవన్ కళ్యాణ్ అడిగారు. మధ్య తరగతి వారు, పేదల సమస్యలు తనకు తెలుసు అని పవన్ కళ్యాణ్ అన్నారు. ఉద్యోగుల సీపీఎస్ సమస్య పరిష్కరించే ప్రయత్నం చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

# సామాజిక అసమానత,అస్పృశ్యత లపై సమరం చేసిన సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే



-స్త్రీలు చదువుకోవాల్సిందే అని పట్టుబట్టి.. ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త
-బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు -నేడు ఆయన జయంతి

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానుభావుడు. స్త్రీలు చదువుకోవాల్సిందే అని పట్టుబట్టి.. ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త. బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు? మహాత్మా జ్యోతిరావు పూలే. భౌతికంగా ప్రపంచాన్ని వదిలి 128 ఏళ్లయినా.. బడుగుల మేలు కోసం పూలే పడిన ఆరాటం? ఇప్పటికీ స్ఫూర్తిని పంచుతోంది. ఇవాళ ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా.. పూలే సేవలను దేశం స్మరించుకుంటోంది.మహాత్మా జ్యోతిరావు పూలే. సమాజంలో అన్ని వర్గాలకూ సమాన హక్కులు ఉండాలనీ.. స్త్రీలు సంఘంలో భాగం కావాల్సిందే అని పోరాటం చేసి.. దేశాన్నే మేల్కొలిపిన మహనీయుడు. అగ్రవర్ణాల నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నా.. ఆఖరికి చదువుకునేందుకు పరిస్థితులు సహకరించకున్నా.. అన్నీ తట్టుకుని.. అందరి కోసం జీవితం అంకింతం చేశారు పూలే. వెనకబడిన కుటుంబంలో పుట్టి.. చిన్నప్పటి నుంచే కష్టాలు ఎదుర్కొన్న పూలే.. సత్య శోధక్ సమాజ్ పేరుతో ఓ సంస్థ ఏర్పాటు చేశారు. బలహీన వర్గాల తరపున పోరాడారు. వారికి అన్ని హక్కులూ అందాలని గొంతెత్తారు.పూలే బాల్యం కష్టాలతో మొదలైంది. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో.. 1827 ఏప్రిల్ 11న పూలే పుట్టారు. 9 నెలల వయసులోనే పూలే తల్లి చిమన చనిపోయారు. తండ్రి గోవిందరావు ఇంకో పెళ్లి వద్దనుకోవడంతో నర్సు సంరక్షణలో పెరిగారు. ఇబ్బందుల మధ్యే.. ప్రాథమిక విద్య పూర్తి చేశారు. చివరికి చదువు మానేసి తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయపడ్డారు. 12 ఏళ్ల వయసులోనే.. సావిత్రీబాయితో పూలే వివాహం జరిగింది. అప్పటి వరకు.. బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ పెరిగిన పూలే.. పెళ్లి తర్వాత అందరి సంక్షేమం కోసం ఇంటి నుంచే కార్యాచరణ మొదలు పెట్టారు.సమాజంలో మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పూలే పని చేశారు. భార్య సావిత్రీబాయికి చదువు చెబుతూ.. మహిళా విద్య కోసం పోరాటం మొదలు పెట్టారు. ఆమె కూడా సహకరించడంతో.. పూలే మరింతగా జనాల్లోకి వెళ్లారు. 1848లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఓ స్కూల్ ను ఏర్పాటు చేశారు. ఇలాంటిది.. దేశంలో ఇదే మొదటిదని కొందరంటారు. ఇక.. అగ్రవర్ణానికి చెందిన స్నేహితుడి ఇంట్లో పెళ్లికి వెళ్లి.. అవమానానికి గురైన పూలే.. ఆ సందర్భం నుంచి బలహీన వర్గాల తరపున పోరాటానికి సిద్ధమయ్యారు. కుల, మతాకు అతీతంగా.. ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలంటూ గొంతెత్తారు.పూలే పోరాటానికి సమాజంలోని అన్ని వర్గాలనుంచి మెల్లగా మద్దతు పెరిగింది. ఇదే ఉత్సాహంతో.. 1851లో అమ్మాయిల కోసం పెద్ద స్కూల్ ఏర్పాటు చేశారు. గణితం, చరిత్ర, జాగ్రఫీ బోధిస్తూ? ప్రపంచంపై అవగాహన కల్పించారు. ఇలాంటివే మరిన్ని స్కూళ్లు ఏర్పాటు చేసి బాలికల విద్య కోసం వీలైనంతగా కృషి చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన పూలే? వితంతువుల పెళ్లిళ్లకు అండగా నిలిచారు. గర్భవతులుగా ఉన్న వితంతువుల కోసం ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. భార్య సావిత్రీబాయితో కలిసి.. అంటరానితనం రూపుమాపేందుకు జనంలో చైతన్యం పెంచారు.జీవితాన్ని పూర్తిగా బడుగుల పోరాటానికే అంకితం చేసిన పూలే దంపతులకు.. పిల్లలు లేరు. వితంతువుల కోసం ఏర్పాటు చేసిన సేవా కేంద్రం నుంచే ఓ శిశువును దత్తత తీసుకున్నారు. ఆ బాబు డాక్టర్ చదువు పూర్తి చేసి పూలే దంపతులు చూపిన మార్గంలోనే సమాజ సేవ చేశారు. ఒంట్లో శక్తి ఉన్నంత వరకు పేదల సంక్షేమానికి పాటుపడిన మహాత్మా పూలే.. 1888 జూలైలో అనారోగ్యంతో మంచాన పడ్డారు. రెండేళ్ల తర్వాత.. ఆరోగ్యం విషమించడంతో.. 1890 నవంబర్ 28న కన్నుమూశారు.

# నయిమ్ కేసు...డైరీలో ఏముంది...

హైదరాబాద్, ఏప్రిల్ 10, (న్యూస్ పల్స్) తెలుగు రాష్ట్రాల్లో పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ నయీం అనుచరుడు బాలన్న మర్డర్ కేసు మిస్టరీగా మారింది. కొత్త కొత్త కోణాలు వెలుగులోకొస్తున్నాయి. నయీం కేసు రీఓపెన్ చేయాలని డిమాండ్లు తెరపైకి రావడం, ఆ వెంటనే బాలన్న హత్యకు గురికావడంతో అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొడుకు నిజంగానే డ్రగ్స్‌కి బానిసై బాలన్నను హత్య చేశాడా? లేక కొడుకుతో ఎవరైనా హత్య చేయించారా? నయీం రైట్ హ్యాండ్‌గా ఉన్న బాలన్న మర్డర్ వెనుక అసలేం జరిగింది? నయీం క్లోజ్ ఫ్రెండ్ బాలన్న మర్డర్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకొస్తున్నాయి. నయీం కేసు రీఓపెన్ చేయాలంటూ పొలిటికల్ తెరపై డిమాండ్లు ఎక్కువవుతున్న నేపథ్యంలో నయీం రైట్ హ్యాండ్ బాలన్న, తన కొడుకు అనురాగ్ చేతిలో అతికిరాతకంగా హత్యకు గురికావడం హాట్ టాపిక్‌గా మారింది. మరెన్నో అనుమానాలకు దారి తీస్తోంది. అనురాగ్‌ను పావుగా వాడుకుని బాలన్నను కావాలనే హత్య చేయించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనురాగ్ డ్రగ్స్ తీసుకుని క్షణికావేశంలో చేసిన హత్య కాదు కావాలనే పథకం ప్రకారం తండ్రిని చంపాడాన్న కొశ్చన్స్ తెరపైకొస్తున్నాయి.మాజీ నక్సలైట్ బాలన్న.. నయీం హయాంలో చెలరేగిపోయాడు. ఇష్టానుసారంగా వ్యవహరించారు. నయీంని కలవాలంటే ఫస్ట్ బాలన్నను కలవాల్సిన పరిస్థితి ఉండేది. అలాగే నయీంకి సంబంధించిన ప్రతి విషయం బాలన్నకి తెలుసు. నయీం అక్రమాల్లో కీలక పాత్ర పోషించాడు బాలన్న. నయీంకి నమ్మినబంటుగా ఉంటూ బాగానే ఆస్తులు వెనకేసుకున్నాడు. నయీం అక్రమాల దగ్గర్నుంచి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో అన్నీ బాలన్నకు తెలుసు. నయీం ఆర్థిక లావాదేవీలన్నీ బాలన్నే చూసుకునేవాడు. అయితే నయీం 2016లో చనిపోయిన తర్వాత మూడేళ్లపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన బాలన్న ఆ తర్వాత బయటకొచ్చి చాలా సైలెంట్ అయిపోయాడు. తనకున్న వ్యాపారాలు చూసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.అయితే నయీం కేసు రీఓపెన్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నయీం కేసులో అవకతవకలు జరిగాయని నయీం అక్రమాస్తుల్నీ బయట పెట్టాలని, నయీంకి సహకరించిన వారిని కనిపెట్టాలని డిమాండ్ చేశారు. ఓపెన్ చేయాలంటూ పొలిటికల్ రచ్చ మొదలైందో లేదో బాలన్న చనిపోవడం పలు అనుమానాలకు కారణమవుతోంది.

# రాజమండ్రిలో ఓసీ వర్సెస్ బీసీ

రాజమండ్రి, ఏప్రిల్ 10, అసలు సిసలు రాజకీయానికి రాజమండ్రి కేంద్రంగా మారింది. అధికార, విపక్షాల మధ్య వ్యూహ, ప్రతివ్యూహాలతో పొలిటికల్ హీట్ రోజురోజుకు ఎక్కువవుతోంది. బలమైన సామాజిక వర్గం మద్దతుతో ఒకరు.. బీసీ ఓటు బ్యాంకును నమ్ముకుని మరొకరు బరిలోకి దిగుతున్నారు. ఒకరిది సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తోడు.. తండ్రి వారసత్వంతో కేంద్రస్థాయిలో చక్రం తిప్పిన చరిత్ర అయితే? మరొకరు తొలిసారిగా ప్రజాక్షేత్రంలో నిలబడుతున్నారు. వైద్యుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న ఈ కొత్త నేత?. రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగిన మహిళా నేతను ఎలా ఢీకొడతారన్నదే ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి పెంచుతోంది..రంజైన రాజకీయాలకు చిరునామా రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం. ప్రముఖ నేతలు ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం ప్రతి ఎన్నిక సమయంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంటుంది. రాజమండ్రి ఎంపీగా ఎన్నికైన చాలామంది నేతలు కేంద్ర మంత్రులుగా పనిచేశారు. సోదరులైన పట్టాభిరామారావు, సత్యనారాయణరావు రాజమండ్రి ఎంపీగా ఎన్నికవడమే కాకుండా, ఇద్దరూ కేంద్ర మంత్రులుగా పని చేశారు. ఇక ఏపీ రాజకీయాల్లో ఎప్పుడూ సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో ఉండే ఉండవల్లి అరుణ్‌కుమార్ సైతం ఇక్కడి నుంచి రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014లో ప్రముఖ సినీ నటుడు మురళీ మోహన్ రాజమండ్రి ఎంపీగా ఎన్నికవగా, 2019 ఎన్నికల్లో ఆయన కోడలు మాగంటి రూప పోటీ చేసి ఓడిపోయారు. ఇక ప్రస్తుత ఎంపీ మార్గాని భరత్ శాసనసభ బరిలో దిగడంతో కొత్త అభ్యర్థిని బరిలోకి దింపింది వైసీపీ. రాజమండ్రికి చెందిన ప్రముఖ వైద్యుడు గూడూరి శ్రీనివాస్ అధికార పార్టీ తరఫున తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించి పోటీ చేస్తున్నారు. మరోవైపు ఎన్‌డీఏ కూటమి తరఫున బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమండ్రిలో యుద్ధానికి సిద్ధమవుతున్నారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. రాజమండ్రి సిటీ, రూరల్‌తోపాటు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వస్తాయి. మిగిలిన మూడు నియోజకవర్గాలైన కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోనివి. ఈ పార్లమెంట్ నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఎక్కువగా తూర్పుగోదావరి జిల్లా వారే ఎంపీలుగా ఎన్నికవుతూ వస్తున్నారు. అందులోనూ కమ్మ సామాజికవర్గం హవాయే ఎక్కువ. ఐతే గత ఎన్నికల్లో ఈ ఆనవాయితీకి బ్రేక్ వేసింది అధికార వైసీపీ..సామాజికవర్గం కోటను బద్ధలుకొట్టి బీసీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించింది. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగిస్తూ బీసీల్లోని శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ గుడూరి శ్రీనివాస్‌కు టికెట్ ఇచ్చింది. కూటమి తరఫున బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తున్నారు. దీంతో రాజమండ్రి పార్లమెంట్‌లో మరోసారి కమ్మ వర్సెస్ బీసీ ఫైట్ ఆవిష్కృతం కాబోతోంది. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో సుమారుగా 11 లక్షల ఓట్లు ఉన్నాయి. లోక్‌సభ, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నిక జరుగుతుండటంతో శాసనసభా స్థానాల్లో గెలిచే అభ్యర్థుల అండతోనే ఎంపీ అభ్యర్థులు గట్టెక్కే అవకాశాలు ఉన్నాయి. మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకునే పార్టీయే ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఇక్కడ రివాజుగా కనిపిస్తోంది. ఐతే ఈ సారి కూటమి తరఫున బీజేపీ పోటీ చేస్తుండటం, ఈ నియోజకవర్గం పరిధిలో ఒకే చోట నుంచి బీజేపీ అసెంబ్లీ బరిలో ఉండటంతో పోటీ ఆసక్తికరంగా మారింది. కూటమి పార్టీల ఓట్లు బదిలీ పెను సవాల్ విసురుతోంది. లోక్‌సభ పరిధిలో అనపర్తి సీటు నుంచి బీజేపీ పోటీ చేస్తుండగా, ఆ స్థానం వదులుకోడానికి సిద్ధంగా లేని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.. తిరుగుబాటు జెండా ఎగరేసే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో వైసీపీ తెగ హ్యాపీగా ఫీల్ అవుతోంది. కూటమిలో కల్లోలం ఎంత ఎక్కువ ఉంటే? తమ పార్టీ అభ్యర్థికి అంత మేలు జరుగుతుందని సంబరం పడుతోంది అధికార పార్టీ. రాజమండ్రి వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌ను వ్యూహాత్మకంగా ఎంపిక చేసింది వైసీపీ.. గత కొన్నేళ్లుగా వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్ శ్రీనివాస్? జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వైద్యుడిగా జిల్లావ్యాప్తంగా విస్తృత పరిచయాలు ఉన్న ఆయనను పార్టీలోకి ఆహ్వానించి తొలుత, రాజమండ్రి సిటీ సమన్వయకర్తగా నియమించింది వైసీపీ.. కానీ, డాక్టర్ శ్రీనివాస్‌కు ఉన్న గుర్తింపు దృష్ట్యా.. ఎమ్మెల్యే కన్నా, ఎంపీగా పోటీ చేస్తేనే ఎక్కువ విజయావకాశాలు ఉంటాయనే అంచనాతో రాజమండ్రి లోక్‌సభ టికెట్ ఖరారు చేసింది వైసీపీ అధిష్టానం. కమ్మ వర్సెస్ బీసీ మధ్య జరుగుతున్న పోటీపై రకరకాల విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజమండ్రి సిటీ, రూరల్ రెండు నియోజకవర్గాల నుంచి ఇద్దరు బీసీ నేతలను బరిలోకి దింపింది వైసీపీ.. దీంతో మొత్తం ముగ్గురు బీసీ లీడర్ల ద్వారా లోక్‌సభను సునాయాసంగా గెలుచుకోవాలని ప్లాన్ చేస్తోంది. ఇక వైసీపీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో రాజానగరం, అనపర్తి స్థానాలు ఎంపీ అభ్యర్థి గుడూరికి సానుకూలత కనిపిస్తోందంటున్నారు. రాజానగరం నియోజకవర్గంతో గూడూరి శ్రీనివాస్‌కు విశేషమైన అనుబంధం ఉందంటున్నారు. ఇక గత ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గంలో వైసీపీకి అత్యధిక మెజారిటీ వచ్చింది. ఇప్పుడు కూడా అక్కడ కూటమి అభ్యర్థి ఎంపికపై రచ్చ జరుగుతుండటం వైసీపీకి అడ్వాంటేజ్‌గా చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిస్థితి ఇలా ఉంటే పశ్చిమగోదావరి జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో వైసీపీ కష్టపడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రిజర్వు నియోజకవర్గాలైన కొవ్వూరు, గోపాలపురం స్థానాల్లో టీడీపీ జనసేన బీజేపీ కూటమి అభ్యర్థులు గట్టిపోటీ ఇస్తున్నారు. నిడదవోలులో జనసేన, టీడీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నప్పటికీ కొంత అసంతృప్తి కనిపిస్తోంది. నియోజకవర్గంలో వైసీపీకి కొంత సానుకూలత ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ మూడు నియోజకవర్గాలపై గూడూరి శ్రీనివాస్ ప్రత్యేకమైన దృష్టి పెట్టి ఓటర్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి? కచ్చితంగా గెలిచే అవకాశాలు ఉండటంతోనే రాజమండ్రిని ఎంపిక చేసుకున్నారని చెబుతున్నారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన వారిలో ఎక్కువ మంది తన సామాజికవర్గం నేతలే కావడం, తన సామాజిక వర్గ ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో రాజమండ్రి నుంచి పోటీకి సిద్ధమయ్యారు పురందేశ్వరి. కూటమి ఓట్లు, తన తండ్రి ఎన్టీఆర్ ఇమేజ్, ప్రధాని మోదీ పట్ల ఉండే సానుకూలత వంటివన్నీ తనకు లాభిస్తాయని అంచనా వేస్తున్నారు పురందేశ్వరి. రాజకీయ అనుభవం, కుటుంబ నేపథ్యం పురందేశ్వరికి ప్లస్‌గా చెబుతున్నారు. అంతేకాకుండా.. రాజమండ్రి సిటీ, రూరల్, రాజానగరం స్థానాల్లో కూటమి అభ్యర్థులు బలంగా ఉండటం పురందేశ్వరికి అడ్వాంటేజ్ అంటున్నారు. కొవ్వూరు గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో కూటమి బలం కూడా పురందేశ్వరికి సానుకూలమయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు పరిశీలకులు. మొత్తానికి రెండు పార్టీలు రాజమండ్రిపై భారీ ఆశలే పెట్టుకుంటున్నాయి. వ్యూహాలు, ప్రతివ్యూహాలతో రాజకీయాన్ని రక్తికట్టిస్తున్నాయి.

## స్వాతంత్ర్య సమరయోధుల, శాస్త్రవేత్తల సేవలు చిరస్మరణీయం

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి**

స్వాతంత్ర్య సమరయోధులు మొరార్జీ దేశాయి వర్ధంతి, హోమియోపతీ పితామహుడు శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్వాతంత్ర్య సమరయోధులు మొరార్జీ దేశాయి వర్ధంతి సందర్భంగా మరియు హోమియోపతీ పితామహుడు శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు. వారిని స్మరించుకున్నారు .ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు

## వీరభద్ర స్వామి ఉత్సవాల్లో పిడకల సమరం

కర్నూలు,కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో శ్రీ భద్రకాళిదేవి, వీరభద్ర స్వామి ఆలయానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. వీరభద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఉగాది తర్వాత ఈ గ్రామంలో పిడకల సమరం జరుగుతుంది..త్రేతాయుగంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ప్రేమికులని ఆలయ చరిత్ర చెబుతుంది. వారి మధ్య ప్రేమ వ్యవహారమే కాస్త గొడవకు దారితీస్తుంది. పెళ్లి విషయంలో వీరభద్ర స్వామి కొంత ఆలస్యం చేస్తారు. దీంతో ప్రేమించి పెళ్లి చేసుకోకుండా భద్రకాళి దేవిని... వీరభద్ర స్వామి మోసం చేశారని అమ్మవారి భక్తులు నమ్మి, వీరభద్ర స్వామిని పేడతో తయారు చేసిన పిడకల తో కొట్టి అవమానించాలని చూస్తారు. వైపు వీరభద్ర స్వామిని వెళ్ళవద్దని వేడుకున్నారని స్థానికులు అంటున్నారు. స్వామి భక్తులు చెప్పిన మాటలు వినుకొండ అమ్మవారి ఆలయం వైపు వెళ్లారని, వీరభద్ర స్వామి వారిపై పిడకలతో దాడి చేశారని కథలుగా చెప్పుకుంటారు. ఈ విషయం తెలుసుకున్న స్వామి వారి భక్తులు కూడా పిడకలతో అక్కడికి వెళ్లి అమ్మవారి భక్తులపై ఎదురు దాడికి దిగారని, అలా ఇరు వర్గాలు పిడకల సమరం సాగించారని అంటుంటారు. .పిడకల సమరంలో దెబ్బలు తగిలిన వారు భద్రకాళి అమ్మవారు, వీరభద్ర స్వామి వార్ల ఆలయాలకు వెళ్లి నమస్కారం చేసుకుని అక్కడ ఉన్న విభూతిని ఇరువర్గాలు భక్తులు రాసుకొని రావాలని బ్రహ్మ ఆదేశించాడని,ఆలయంలో ఇద్దరు విగ్రహాలను ఏర్పాటు చేసి వారికి కళ్యాణం జరిపిస్తామని బ్రహ్మదేవుడు మాట ఇచ్చినట్లు ఆలయ చరిత్ర చెబుతుంది...

# షర్మిళ దూకుడుకి కారణం ఎవరు




కడప, ఏప్రిల్ 10 షర్మిల అంత ధైర్యంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు? ఆమె వెనుకున్నది ఎవరు? చంద్రబాబా? కాంగ్రెస్ హై కమాండ్ ఉందా? సొంత అన్నపై ఆ స్థాయిలో ఎందుకు విరుచుకుపడుతున్నారు? ఇలా రకరకాల చర్చ కొనసాగుతోంది. ఆమెకు అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జగన్ సోదరి కావడంతోనే ఏం చేయలేరన్న ధీమానా? మరో కారణం ఉందా? అసలు షర్మిల వెనుక ఉన్నది ఎవరు? ఇప్పుడు అందరి నోట ఇదే వినిపిస్తోంది. బలమైన చర్చ నడుస్తోంది. జగన్ ను రాజకీయ ప్రత్యర్థులు కూడా అనలేని మాటలను షర్మిల అనగలుగుతున్నారు. బలమైన ఆరోపణలు చేయగలుగుతున్నారు. షర్మిల వెనుక ఉండి చంద్రబాబు నాటకం ఆడిస్తున్నారని తరచు వైసిపి నేతలు ఆరోపిస్తుంటారు. షర్మిల కాంగ్రెస్ లో చేరడం, ఏపీ రాజకీయాల వైపు రావడం, పీసీసీ పగ్గాలు అందుకోవడం వెనుక చంద్రబాబు వ్యూహాలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. ప్రస్తుతం షర్మిల రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతున్నారు. కడప జిల్లా నుంచి లోక్సభ స్థానానికి పోటీ చేస్తున్నారు. ప్రధానంగా బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ జగన్ పై విరుచుకుపడుతున్నారు. అవినాష్ వెనుక జగన్ ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఏకంగా కడప నడిబొడ్డులోనే సౌండ్ చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రంలో విపక్ష నేతలే కడపలో విమర్శలు చేసేందుకు వెనుకడుగు వేస్తారు. అటువంటిది షర్మిల నిర్భయంగా ఆరోపణలు చేస్తుండడం మాత్రం సాహసమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆమె వెనుక బలమైన శక్తి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అది చంద్రబాబుకు మించి ఉండొచ్చు అని భావిస్తున్నారు. వాస్తవానికి సొంత పార్టీతో ఫెయిల్ అయిన తర్వాత షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించారు. తెలంగాణ రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని భావించారు. కనీసం ఆమె ఏపీ వైపు చూసేందుకు కూడా ఇష్టపడలేదు. కానీ ఉన్నట్టుండి పరిస్థితి మారింది. కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ ఎంటరయ్యారు. షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయాలని షర్మిల భావించారు. అందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఒప్పుకోలేదు. దీంతో షర్మిల తప్పనిసరి పరిస్థితుల్లో ఏపీకి రావాల్సి వచ్చిందని టాక్ నడిచింది. కానీ షర్మిల ఏపీ వైపు రావడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి అని తెలుస్తోంది. కష్టకాలంలో ఉండగా తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు అందుకున్న రేవంత్ దూకుడుగా వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపైకి నిలపగలిగారు. పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు. రేవంత్ రెడ్డి ఉదంతాన్ని ఉదాహరణగా తీసుకునే షర్మిల ఏపీలో కాంగ్రెస్ పగ్గాలు తీసుకుని దూకుడుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణతో పాటు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఏపీకి సంబంధించి రాజకీయ నేతల మూలాలు ఈ రెండు రాష్ట్రాల్లో ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాదులో ఏపీలోని ప్రతి రాజకీయ నేతల ఆస్తులు, వ్యాపారాలు కొనసాగుతున్నాయి. దీంతో అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో నేతలు తగ్గి వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో వైసిపి నేతలు అతీతులు కాదు. అందుకే వారి దూకుడుకు కళ్లెం వేసి షర్మిల ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో పరిస్థితులను చూసి ఇక్కడ షర్మిల స్వేచ్ఛగా రాజకీయాలు చేయగలుగుతున్నారు. వైసిపి తో పాటు జగన్ పై షర్మిల బలమైన ఆరోపణలు చేస్తుండగా.. ఆ స్థాయిలో షర్మిలపై వైసీపీ నేతలు విరుచుకు పడడం లేదు. ఒకటి తెలంగాణలో ఆస్తులు తో పాటు వ్యాపారాలు.. మరోవైపు షర్మిల వైయస్ బిడ్డ కావడంతో వైసిపి నేతలకు ఎటూ పాలు పోవడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే షర్మిల దూకుడు వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని స్పష్టమైంది. రేవంత్ మాదిరిగా దూకుడుగా వ్యవహరించి ఏపీకి భావి నాయకురాలిగా అవతరించాలని షర్మిల భావిస్తున్నారు. మరి ఆమె ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి. రంగంలోకి ఐప్యాక్ఇప్పుడు ఐప్యాక్ ఏపీలో అన్ని పార్టీలకు పని చేస్తోంది. మీరు చదివింది నిజమే. వైసిపి తో పాటు ప్రత్యర్థి పార్టీలకు సైతం ఐప్యాక్ సేవలందిస్తోంది. ప్రత్యర్థి పార్టీలను పలుచన చేసేందుకు ఆ టీం చేయని ప్రయత్నాలు లేవు. లోకేష్ పాదయాత్ర సమయంలో అయితే వందలాది మంది రంగంలోకి దిగారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు.. కనికట్టు చేసే ప్రయత్నం చేశారు. కానీ ఇవేవీ పట్టించుకోని లోకేష్ పాదయాత్రను పూర్తి చేయగలిగారు. అయితే ఇప్పుడు ఐప్యాక్ టీం షర్మిల కోసం పనిచేస్తోంది. ప్రస్తుతం కడప జిల్లాలో షర్మిల పర్యటిస్తున్నారు. అధికార పార్టీతో పాటు అన్న పై విరుచుకుపడుతున్నారు.

## ఆ నలుగురు పొలిటికల్ రిటైర్మెంట్

విజయనగరం, ఏప్రిల్ 10 రాష్ట్ర రాజకీయాల్లో విజయనగరం జిల్లాది ప్రత్యేక స్థానం. ఈ జిల్లాకు చెందిన ఎంతో మంది నేతలు రాజకీయాల్లో రాణించారు. తమదైన ముద్ర చూపించారు. దశాబ్దాలుగా రాజకీయాలు చేశారు. కానీ ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు యువతరానికి ప్రాధాన్యం ఇవ్వడంతో.. ఆ వృద్ధ నేతలు ప్రత్యక్ష రాజకీయాలకు ముగింపు పలికారు. స్వచ్ఛందంగా పక్కకు తప్పుకొని కొత్త నేతలకు అవకాశం ఇచ్చారు. పూసపాటి అశోక్ గజపతిరాజు, వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్, శత్రుచర్ల విజయరామరాజు, పతివాడ నారాయణస్వామి నాయుడులు ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. దీంతో దశాబ్దాల రాజకీయ చరిత్రకు తెరపడినట్లు అయ్యింది. విజయనగరం జిల్లాలో పూసపాటి అశోక్ గజపతిరాజు దశాబ్దాలుగా పట్టు సాధిస్తూ వచ్చారు. విజయనగరం రాజ కుటుంబానికి చెందిన అశోక్ గజపతిరాజు 1978లో రాజకీయ అరంగేట్రం చేశారు. జనతా పార్టీ తరఫున పోటీ చేసి తొలి విజయం అందుకున్నారు. టిడిపి ఆవిర్భావంతో ఎన్టీఆర్ పిలుపుమేరకు ఆ పార్టీలో చేరారు. 1983 ఎన్నికల్లో గెలుపొంది ఎన్టీఆర్ క్యాబినెట్లో మంత్రి పదవి చేపట్టారు. తరువాత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారి కీలక పోర్టు పోలియోలను దక్కించుకున్నారు. 2014లో మాత్రం విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొంది.. ఎన్డీఏ ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. కానీ ఈ ఎన్నికల్లో వయోభారంతో తప్పుకున్నారు. కుమార్తె అదితి గజపతి రాజును రెండోసారి విజయనగరం అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా నిలబెట్టారు. ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్ బై చెప్పినట్లు కూడా అశోక్ ప్రకటించారు. పాత తరం నేతల్లో రాజకీయాలకు వన్నెతెచ్చిన నాయకుల్లో వైరిచర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ ఒకరు. 1977లో తొలిసారిగా పార్వతీపురం పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కిషోర్ ఎంపీగా గెలుపొందారు. ఐదుసార్లు లోక్సభకు ప్రాతినిధ్యం వహించారు. ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సుదీర్ఘకాలం కేంద్ర మంత్రివర్గంలో కొనసాగారు. అయితే గత ఎన్నికల్లో అనూహ్యంగా తెలుగుదేశం పార్టీలో చేరారు. అరకు పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి యాక్టివ్ రాజకీయాలకు దూరమయ్యారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో.. టిడిపికి కిషోర్ రాజీనామా ప్రకటించారు. ఇకనుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకూడదని నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాల పాటు రాజకీయాల్లో శత్రుచర్ల విజయరామరాజు చెరగని ముద్ర వేసుకున్నారు. 1978లో తొలిసారిగా నాగూరు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన శత్రుచర్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. అటు తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1978, 83, 85, 9 నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.

# పయ్యావుల సెంటిమెంట్ వర్కౌవుట్ అవుతుందా


అనంతపురం, ఏప్రిల్ 10, పయ్యావుల కేశవ్.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయాలు తెలిసిన ప్రతి ఒక్కరికి ఈ పేరు సుపరిచితం. తెలుగుదేశం పార్టీఅధినేత చంద్రబాబు నాయుడుకి నమ్మిన బంటు. పార్టీ అధికారంలో ఉన్న అధికారంలో లేకపోయినా కీలక విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలించి చక్కబెడుతూ అధినేత చంద్రబాబుకు సహాయకుడిగా ఉంటారు. అలాంటి నేతకు ఒక విచిత్రమైన సెంటిమెంట్ చిరాకు తెప్పిస్తోంది. ఉరవకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి... నియోజకవర్గంలో ఎదురెలేని రారాజు. గత మూడు దశాబ్దాలుగా ఉరవకొండ నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కొనసాగుతూ వస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందంటే చాలు ఏ నియోజకవర్గానికైనా పదుల సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేయడానికి ఆ పార్టీ అధినేతలకు అప్లికేషన్లు పెట్టుకుంటూ ఉంటారు. కానీ ఊరవకొండ నియోజకవర్గంలో మాత్రం తెలుగుదేశం పార్టీలో పయ్యావుల కేశవుని కాదని మరొకరు అప్లికేషన్ వేయడానికి కూడా సాహసించరు. అలాంటి నేతకు నియోజకవర్గంలో ఒక సెంటిమెంట్ చిరాకు పుట్టిస్తుంది. అదేనండి ఉరవకొండలో పయ్యావుల కేశవ్ ఓడిపోతేనే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ నేటికీ కొనసాగుతూనే వస్తుంది. ఈసారి ఆ సెంటిమెంట్ బద్దలు కొట్టి కొత్త చరిత్ర సృష్టించాలని చూస్తున్నారు. 30 ఏళ్లుగా ఆయన గెలిచిన ప్రతి సారీ పార్టీ అధికారానికి దూరమవుతోంది. ఆయన ఓడినపోయిన ప్రతిసారీ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. పయ్యావుల కేశవ్ మొదటిసారి 1994లో పోటీ చేశారు. ఆ ఒక్కసారి మాత్రమే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో ఓడిపోయారు. అప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. 2014లో ఓడిపోయారు. అప్పుడు కూడా టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2004, 2009, 2019లో పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.



ఈ మూడు దఫాలుగా కూడా తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. 1994 మినహా ప్రతి ఎన్నికల్లో కూడా ఇదే సెంటిమెంట్ పయ్యావులను చికాకు పెడతోంది. 30 ఏళ్ల క్రితం సీన్ మళ్లీ రిపీట్ అవుతుందని అంటున్నారు పయ్యావుల కేశవ్. కచ్చితంగా ఈసారి విజయం సాధిస్తానన్న ధీమాతో ఉన్నారు. అంతే కాదు రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ప్రతి సభలో చెబుతున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాగళంలో కూడా పయ్యావుల ఈ విషయాన్ని ప్రస్తావించారు. 2024 ఎన్నికల్లో ఉరవకొండ శాసనసభ్యునిగా గెలిచి తీరుతానని రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది అన్నారు. 2024లో టిడిపి అధికారంలోకి వస్తుంది ఉరవకొండ ఎమ్మెల్యేగా నేనే గెలుస్తా అంటూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తేల్చి చెప్పారు.

# బాలకృష్ణ హ్యాట్రిక్ సాధ్యమా

అనంతపురం, ఏప్రిల్ 10, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఓటమి అనేదే ఎరుగదు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే విజయం మాత్రం ఆ పార్టీ వారిదే అనేలా ఆ నియోజకవర్గ ప్రజలు వారికి పట్టం కడుతూ వస్తున్నారు. ఇంతకు ఆ నియోజకవర్గం ఏది అనుకుంటున్నారా.. ప్రస్తుతం బాలకృష్ణ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న హిందూపురం నియోజకవర్గం. హిందూపురం ఈ పేరు వినగానే టక్కున గుర్తుకు వచ్చేది దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఇక్కడ ఓటమి అంటే తెలియదు. అందువల్ల రాను రానూ హిందూపురం కాస్త నందమూరి పురం అన్నట్లుగా మారిపోయింది. పార్టీ ఆవిర్భంలో పి రంగనాయకులు అనే చేనేత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి గెలిపించుకున్నారు. 1984లో ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయపరంగా తలెత్తిన రాజకీయ సంక్షోభం కారణంగా ఎన్టీ రామారావును అప్పటి గవర్నర్ రామ్లాల్ పదవి చిత్యున్ని చేశారు.



ఇది రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందనే విషయాన్ని అప్పటి ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిరసించాయి. రాష్ట్ర ప్రజలు కూడా పెద్ద ఎత్తున స్పందించి ఎక్కడికక్కడ ప్రజా ఆందోళనలు నిర్వహించారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత ఇందిరాగాంధీ తన నిర్ణయాన్ని మార్చుకొని తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పునరుద్దింపజేశారు. రాజకీయ సంక్షోభంలో హిందూపురం నియోజకవర్గంలో జరిగిన హింస అంతా ఇంతా కాదు. ప్రభుత్వ ఆసుల ధ్వంసం అదేవిధంగా అనేక ఆందోళనలు జరిగాయి. రాష్ట్రంలో ఎన్టీ రామారావు అప్పట్లో స్పష్టం చేశారని పార్టీ సీనియర్ నేతలు చెప్పుకొచ్చారు. అప్పటినుంచి ఎన్టీ రామారావు హిందూపురం నుంచి పోటీ చేస్తూ విజయం సాధిస్తూ వచ్చారు. సీనియర్ ఎన్టీఆర్ అనంతరం ఆయన కుమారులు నందమూరి హరికృష్ణ, నందమూరి బాలకృష్ణ సైతం హిందూపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు.

# డ్రైనేజీలను ఆక్రమిస్తే కూల్చివేస్తాం

## మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10–: ప్రధాన వీధుల్లోని డ్రైనేజీలను ఆక్రమిస్తే కూలగొడతామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు వార్డులో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలిసి ఆయన బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సంజీవనగర్ , నూనెపల్లె సచివాలయాల పరిధిలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణలను కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు.

# వివాహ వేడుకల్లో అభిరుచి మదు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10–నంద్యాల జిల్లా గోస్పాడు మండలం విలేఖరి వెంకట సుబ్బయ్య చెల్లెలు వివాహనికి భారతీయ జనతా పార్టీ నంద్యాల పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మదు వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు. కార్యకర్తలు. పాల్గొన్నారు.

# జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10 – సాధారణ ఎన్నికల సమాచారానికి సంబంధించి కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు .ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో పోల్ డే మానిటరింగ్, రిపోర్ట్స్ మానిటరింగ్, సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్, కాల్ సెంటర్, కంప్లైంట్స్ మానిటరింగ్, జిపిఎస్ మానిటరింగ్, వెబ్ కాస్టింగ్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్, ఎంసీసి టీం లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారుజిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,06,69,170/- ల నగదు, రూ. 65,43,455/- ల విలువైన 34,827 లీటర్లు, రూ.9,822/- ల విలువైన 2,186 గ్రాముల మాదకద్రవ్యాలు, రూ.38,45,960/- విలువైన 3,027 గ్రాముల ఆభరణాలు, రూ.8,51,406/-ల విలువైన ఇతర వస్తువులను వెరసి మొత్తం రూ. 4,19,19,813/- లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై మొత్తం 129 ఫిర్యాదులు అందగా 48 ఫిర్యాదులకు పరిష్కరించామని 81 ఫిర్యాదులను సరైన పత్రాలు లేనందున తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ ప్రచారాలకు సంబంధించి అనుమతుల కోసం 681 దరఖాస్తులు రాగా 533 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని, 57 దరఖాస్తులు ప్రోగ్రెస్ లో వున్నాయని మిగిలినవి తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన 23 మంది వాలంటీర్లను విధుల నుండి తొలగించామన్నారు. రాజకీయ పార్టీ అనుచరులకు సంబంధించి టిడిపికి చెందిన 11 మందిని, వైఆర్సీపీకి చెందిన 15 మందిని ఇతరులకు చెందిన 8 మందిని మొత్తం 34 మంది అనుచరులపై కేసులు నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

# ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరవేయడమే

## ఇరిగెల, భూమా కుటుంబాలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10– ఆర్లగడ్డ లో టిడిపి జెండా ఎగరవేస్తామని భూమ ఇరిగెల కుటుంబాలు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సరిగ్గా 33 సంవత్సరాల క్రితం మహానటుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు, మాజీ మంత్రివర్యులు గుండ్లకుంట శివారెడ్డి 1991 నందు భూమా నాగిరెడ్డి గెలుపు కోసం ఇరిగెల బోరెడ్డి కుమారులు ఇరిగెల రామ పుల్లారెడ్డి ఇరిగేలా బ్రదర్స్ వారిని ఎన్నికలలో విజయం కోసం కలుపగా అప్పట్లో భూమా నాగిరెడ్డి విజయం సాధించారు. బుధవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నంద్యాల ఎంపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రతేక చొరవతో భూమా, ఇరిగెల కుటుంబాలను ఒక్కటీ చేశారు.తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ పొత్తులో భాగంగా ఎన్నికలలో విజయం కోసం ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రామ పుల్లారెడ్డి ఇరిగెల సోదరులను, భూమా వారసులైన ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ, భూమా విఖ్యాత్ రెడ్డి , అఖిలప్రియ భర్త భార్గవ రామ్ నాయుడు లతో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి చర్చలు జరిపి చర్చలను విజయవంతం చేశారు. సరిగ్గా 33 సంవత్సరాలకు ఇరిగెల, భూమా కుటుంబాలు, కార్యకర్తలు , నాయకులు ఏకం కావడంతో ఆళ్లగడ్డలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ గెలుపు, నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టరు .బైరెడ్డి శబరి కి మంచి మెజార్టీ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు మేధావులు చర్చించుకుంటున్నారు, ఈ కుటుంబాలను కలపడంలో అప్పట్లో నందమూరి తారక రామారావు శివారెడ్డి గారి తర్వాత ఆ ఘనత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందని చెప్పకతప్పదు

# ఈనెల 12న ఈవీఎంల ర్యాండమైజేషన్

## జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు సమావేశం



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10–సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 12వ తేదీన ఈవీఎంల మొదటి దశ రాండమైజేషన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల మొదటి దశ రాండమైజేషన్ పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి తరఫున కశెట్టి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్ భాష, తెలుగుదేశం పార్టీ ప్రతినిదులు శివరామ్ రెడ్డి, వై వి రామిరెడ్డి, బిజెపి పార్టీ తరఫున నాగ శివ సాయి, వైయస్సార్సీపి తరఫున అనిల్ అమృత రాజు, సాయిరాం రెడ్డి, సిపిఐ(ఎం) పార్టీ తరఫున పూల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 12వ తేదీన ఈవీఎం ల మొదటి దశ రాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. అలాగే 13వ తేదీ అసెంబ్లీ నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం ల మొదటి దశ రాండమైజేషన్ జరుగుతుందన్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారుల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఈనెల 6వ తేదీ పూర్తి చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ఇంటింటి ప్రచారానికి సంబంధించి ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తే నిబంధనల మేరకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 18 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని నామినేషన్ పత్రాలు వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు సంబంధించిన మూడు వాహనాలతో పాటు రిటర్నింగ్ అధికారి గదిలోకి 5 మందిని అనుమతి ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ యాక్టివిటీస్ ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకొస్తామన్నారు. ఓటింగ్ శాతం తక్కువగా ఉన్న 50 ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తామని కలెక్టర్ వివరించారు అలాగే పట్టణ ప్రాంతాలలో ఓటర్ల చైతన్యంపై కోటింగ్ కూడా హోర్డింగ్ లను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫార్మ్ -6 దరఖాస్తులు, షిఫ్టింగ్ ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలను స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిని కోరారు.

# నంద్యాల లో టీడీపీ అభ్యర్థి ఫరూక్ కి తప్పిన పెను ప్రమాదం



నంద్యాల జిల్లా :-10-04-2024,నంద్యాల నుండి హైదరాబాద్ కి వెళ్తుండగా పాణ్యం మండలం తమ్మరాజు పల్లె వద్ద జరిగిన ప్రమాదం. × బర్రెలను ఢీకొన్న కారు,కారులో ఉన్న ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి ఫరూక్.నంద్యాలోని ఓ ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫరూక్. ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకున్న పాణ్యం టిడిపి అభ్యర్థి గౌరీ చరిత.ఫరుక్ ను పరామర్శించి నంద్యాల ఆస్పత్రికి తరలింపు. ఆస్పత్రి వద్ద భారీగా తరలివచ్చిన టిడిపి నాయకులు ,కార్యకర్తలు.

# ఎన్ ఎం డి ఫరూక్ ను పరామర్శించిన. ఎం ఎం డి. ఇస్మాయిల్

శిరివెళ్ళ :- ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నంద్యాల టిడిపి అభ్యర్థి ఎన్ ఎం డి ఫరూక్ ను నంద్యాల ప్రైవేట్ ఆసుపత్రి లో శిరివెళ్ళ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కె. మహమ్మద్ ఇస్మాయిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారంటే ఫరూక్ కి ఆ అల్లా ఆశీస్సులు ఉన్నట్లేనని , ప్రజలకు సేవ చేయాలని తపన ఉన్న వ్యక్తి ఫరూక్ అని నంద్యాలలో ఫరూక్ భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. అయన త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు వచ్చి ప్రజలకు సేవ చేయాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాని అన్నారు. ఫరూక్ తన ఆరోగ్యం గురించి మాట్లాడుతూ... తన పార్టీ కార్యకర్తలు గాని , నాయకులు గానీ ఎవరు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని , తన ఆరోగ్యం బాగుందని త్వరలో మన ముందుకు వస్తారని తెలిపారన్నారు.



# కన్నడ భక్తులతో నిండిన మహానంది క్షేత్రం



నంద్యాల జిల్లా :- 10-04-2024, మహానంది క్షేత్రం మంగళవారం రాత్రి నుండి కన్నడ భక్తులతో నిండిపోయింది. బుధవారం మధ్యాహ్నం వరకు కన్నడ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకున్నారు. ఇందులో భాగంగానే వాహనాలు నిలిపే స్థలంలో త్రాగు నీరు మరియు ఆలయానికి వచ్చే దారి మధ్యలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ తదితర సౌకర్యాలు కల్పించారు. క్షేత్రం ప్రవేశద్వారం నుండి ఎండ వేడిమి నుండి భక్తులకు రక్షణ కల్పించడానికి టెంట్లు మరియు పెండల్స్ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి 50 రూపాయల టికెట్ విక్రయించిన ఉచిత దర్శన సౌకర్యం కల్పించడంతోపాటు బుధవారం ఉదయం 6:30 నుండి 10 గంటల వరకు ఉచిత దర్శన ఏర్పాట్లు ఆలయ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. మంగళవారం సాయంత్రం నుండి రద్దీని దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా చంటి పిల్లలు ఉన్న మహిళలు వృద్దులు వికలాంగులకు ప్రత్యేకంగా వెళ్లేందుకు అనుమతించారు. కన్నడ భక్తులకు క్షేత్రంలో ప్రవేశించిన సందర్భంలో ఉచితంగా బిస్కెట్లను కూడా పంపిణీ చేసి ఉచిత దర్శనం అనుమతించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వేచి ఉండకుండా త్వరగా దర్శనం చేసుకుని తమ తమ స్వస్థలాలకు వెళ్లేందుకు క్షేత్రంలోని ప్రధాన ఆలయంలో ఉన్న అన్ని ద్వారాలను తెరచి ఉంచి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**